## బార్ అసోసియేషన్ భవన నిర్మాణ కోసం స్థల పరిశీలన



భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా జడ్జి కుంచాల సునీత

ఆర్మూర్‌టౌన్, జూలై 10: పట్టణంలోని కోర్టులో ఆర్మూర్ బార్ అసోసియేషన్ భవన నిర్మాణం కోసం స్థలాన్ని జిల్లా జడ్జి కుంచాల సునీత, ఆర్మూర్ కోర్టు సివిల్ జడ్జి నసీం సుల్తానాతో కలిసి బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య,ఉపాధ్యక్షుడు శంకర్,న్యాయవాదులు అరుణ్, పిపి ఖాందేశ్ శ్రీనివాస్,భూపతి రెడ్డి,శ్రీధర్,జిజి రామ్ తదితరులు పాల్గొన్నారు.

## అత్తింటి వేధింపులకు వివాహిత బలి



లావణ్య (ఫైల్)

వినాయక్‌నగర్, జూలై 10: అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లాకేంద్రంలో బుధవారం చోటుచేసుకున్నది. నగరంలోని సుభాష్ నగర్‌కు చెందిన లావణ్య (23)కు ఆర్యనగర్‌లో ఉంటున్న దాసరి వెంకటేశ్‌తో ఏడు నెలల క్రితం వివాహం జరిగింది. పెండ్లి సమయంలో రూ.23 లక్షల నగదు, 33 తులాల బంగారం, రూ. నాలుగు లక్షలు విలువ చేసే బైక్ ఇచ్చారు. కొంతకాలం తర్వాత అదనపు కట్నం తీసుకురావాలంటూ లావణ్యను భర్త వెంకటేశ్, అత్త నాగమణి, మామ పాపయ్య వేధించసాగారు. శారీరకంగా, మానసికంగా హింసించారు. ఆషాడమాసం కావడంతో ఈ నెల 4న తల్లిగారింటికి వచ్చిన లావణ్య బుధవారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో విషం తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. తన కూతురు ఆత్మహత్య చేసుకోవడానికి ఆమె భర్త వెంకటేశ్, అత్తమామలు నాగమణి, పాపయ్య కారణమని మృతురాలి తల్లి వనం సరోజ మూడోటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ వెల్లడించారు.



తెలంగాణ ఆగ్రోస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా కాసుల బాల్‌రాజు హైదరాబాద్ ఆగ్రోస్ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు చేపట్టారు. మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు, శాసన మండలి సభ్యుడు మహేశ్‌గౌడ్, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

–బాన్సువాడ టౌన్, జూలై 10

## సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

- జిల్లాకేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, జూలై 10 : సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సి చర్యల్లో భాగంగా జిల్లా స్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా సీజనల్ వ్యాధులు సోకితే 73864 29323, 90597 64785 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వవచ్చని పేర్కొన్నారు. వర్షాకాలంలో మలేరియా, చికెన్ గున్యా, అతిసారా, విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉంటుందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.సీజనల్ వ్యాధులకు సంబంధించిన సమాచారం కంట్రోల్ రూం కు అందిన వెంటనే యుద్ధప్రతిపాదికన వైద్య బృందాలు స్పందించి చర్యలు తీసుకునేలా సన్నద్ధం చేశామని కలెక్టర్ తెలిపారు. కంట్రోల్ రూం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## బినోలా నుంచి కంఠం వరకు గోదావరి జలాలు



వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

మాక్లూర్, జూలై10: మండలంలోని చిక్లీ, గుంజిలి గ్రామాల శివారులో నిర్మించనున్న మినీ ఎత్తిపోతల పథకం స్థలాన్ని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. లిఫ్ట్‌నకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరి జలాలను నవీపేట మండలం బినోలా గ్రామం నుంచి నందిపేట్ మండలంలోని కంఠం గ్రామంలో ఎత్తిపోసేలా లిఫ్ట్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి పైప్‌లైన్ ద్వారా చిక్లీ, గుంజిలి గ్రామాలకు సాగునీరందేలా పైప్‌లైన్ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ లిఫ్ట్ ద్వారా రెండు గ్రామాలతోపాటు, కంఠం గ్రామంలోని 13,300 మంది రైతులకు లబ్ధి చేకూరగా, 3100 ఎకరాలకు సాగు నీరందుతుందని అన్నారు. 2025 జనవరిలో లిఫ్ట్ పనులు ప్రారంభమై, 18 నెలల్లో పూర్తవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్లు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో గంజాయి పట్టివేత

వినాయక్‌నగర్, జూలై 10: జిల్లా కేంద్రంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్ తెలిపారు. నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు, చంద్రశేఖర్ కాలనీ ఎక్స్‌రోడ్డు వద్ద ప్రొహిబిషన్,ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సభ్యులు బుధవారం తనిఖీ చేపట్టారు. బైక్‌పై వచ్చిన ఇద్దరు అనుమానితులను తనిఖీ చేయగా వారి వద్ద 2 కిలోల 250 గ్రాముల ఎండు గంజాయి లభించింది. దీంతో నిందితులైన నగరంలోని మిర్చి కంపౌండ్‌కు చెందిన బాబ ఖాన్‌తోపాటు సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం బీబీపేట్ గ్రామానికి చెందిన కేతావత్ కిషన్ ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ వెంకటేశ్ తెలిపారు. ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. దాడిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై నర్సింహాచారి తో పాటు హెడ్ కానిస్టేబుల్ నారాయణ రెడ్డి, కానిస్టేబుళ్లు భోజన్న,ఉత్తం,రామ్ బచన్, అవినాష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## బస్సులో ఫోన్ చోరీ.. అరగంటకుపైగా నిలిచిన ప్రయాణం

నాగిరెడ్డిపేట, జూన్ 10: ఆర్టీసీ బస్సులో స్మార్ట్ ఫోన్ చోరీకి గురవడంతో బస్సు అరగంటసేపు నిలిచింది. వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్ డిపోనకు చెందిన బస్సులో పశ్చిమ బెంగాల్‌కు చెందిన వ్యక్తి బుధవారం ప్రయాణిస్తున్నాడు. అతడు ఎల్లారెడ్డి బస్టాండ్ వద్ద నిద్రలోనుంచి లేచి చూసుకోగా స్మార్ట్ ఫోన్ కనిపించలేదు. విషయం కండక్టర్‌కు తెలుపడంతో నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్ ఎదుట బస్సును నిలిపి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్సై అచ్చానాయక్, కానిస్టేబుల్ గంగాధర్ కలిసి ప్రయాణికుల వద్ద తనిఖీ చేశారు. ఫోన్ ఆచూకీ లభించకపోవడంతో బస్సును పంపించివేశారు. సుమారు అరగంటపాటు బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

## గ్రంథాలయ చైర్మన్ రేసులో అనిల్‌గౌడ్?



సీఎం రేవంత్‌రెడ్డితో అనిల్ గౌడ్ (ఫైల్)

వేల్పూర్, జూలై 10: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మండలంలోని సహేబ్‌పేట్ గ్రామానికి చెందిన రంగు అనిల్‌గౌడ్ పోటీలో ఉన్నట్లు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో నామినేట్ పదవులు భర్తీ చేస్తున్న నేపథ్యంలో కొందరు సీనియర్ నాయకులు పదవుల కోసం తీవ్రంగా పోటీ పడుతున్నట్లు తెలిసింది. అయితే అనిల్ గౌడ్ 25 ఏండ్లుగా పార్టీ అభివృద్ధి కోసం, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఆయన ఎంతో కృషి చేశారు. గతంలో జాన్కంపేట్ సర్పంచ్‌గా, జడ్పీటీసీగా పోటీ చేసి అతి తక్కువ ఓట్లతో ఓటమి చెందారు. ప్రస్తుతం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అనిల్ గౌడ్ కొనసాగుతున్నారు. బాల్కొండ నియోజకవర్గంలో చురుకైన నాయకుడిగా ఎంతో గుర్తింపు పొందా రు. సేవా కార్యక్రమాల్లోనూ అనిల్ గౌడ్ ఎంతో ముందున్నారు. కొంత కాలం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పటికీ పార్టీని నమ్ముకొని అనిల్ గౌడ్‌పని చేశారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఆయన ఎంతో కృషి చేశారు. తన సేవలను పార్టీ తప్పకుండా గుర్తిస్తుందని, జిల్లా గంర్థాలయ చైర్మన్ పదవి తనకే వస్తుందని అనిల్‌గౌడ్ ధీమాతో ఉన్నట్టు తెలిసింది. ఇటీవల సీఎం రేవేంత్‌రెడ్డిని కలిసి పార్టీకి కోసం తాను కొంత కాలం నుంచి కష్టపడుతూ వస్తున్నానని, నామినేట్ పదవి అందించాలని కోరినట్లు తెలిసింది. సీఎం సైతం సానుకులంగా స్పందించిట్లు సమాచారం. జిల్లా నాయకులతో కలిసి మెలిసి ఉంటూ వస్తున్న అనిల్ గౌడ్‌కు జిల్లా గ్రంథాయల చైర్మన్ పదవి తప్పకుంగా వస్తుందని మండలంలో చర్చజరుగుతోంది.








